క్లుప్తంగా

నేటితో దరఖాస్తులకు గడువు పూర్తి

నిడదవోలు: గీత కార్మికులకు కేటాయించబడిన మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు గడువు శనివారం సాయంత్రం 5 గంటలతో పూర్తవుతుందని నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్‌జే సతీష్‌బాబు తెలిపారు. గీత కులాల వారికి కేటాయించిన మద్యం షాపులకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిడదవోలు మండలం గౌడ కులస్తులకు కేటాయించిన మద్యం దుకాణానికి శుక్రవారం 14 దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా పెరవలి మండలం శెట్టిబలిజ కులానికి సంబంధించిన దుకాణానికి 9 మంది దరఖాస్తు చేసుకున్నారు. శనివారం చివరి రోజున అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలోని గీత కులాలకు కేటాయించబడిన మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునే వారు ప్రభుత్వం నిర్ణయించిన దరఖాస్తుకు నాన్ రిఫండబుల్ రుసుం రూ.2 లక్షలు డీడీలను డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, రాజమహేంద్రవరం, ఈస్ట్ గోదావరి పేరున తీసుకోవాలని నిడదవోలు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



బల్లిపాడులో విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడులో నూతనంగా నిర్మించిన సాయి రామ జ్ఞాన మండలి, మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి యాగశాలలో హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద వేద పండితులు మానేపల్లి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన పూజలు చేశారు. సుమారు రూ. కోటి వ్యయంతో సాయి భక్తులు వల్లభని శ్రీనివాసరమణ, సాయిరామ నిత్యలేఖన సమితి ఆధ్వర్యంలో ఆలయం నిర్మించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దంపతులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లిన శివ, నాయకులు నామన పరమేశ్వరరావు, కాకర్ల శ్రీను, మద్దుకూరి శంకరం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామలింగేశ్వస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామంలో స్వయంభుగా వెలసిన ఉమా అక్షయ రామలింగేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలల్లో మూడు రోజులు పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. హోమాల నిర్వహణకు ప్రత్యేక యాగశాలలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 10న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



పోతవరంలో ఉమారాలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

నల్లజర్ల: పోతవరం–కవులూరు గ్రామాల మధ్య వేంచేసిన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. వైద పండితులు హెచ్.సతీష్ శర్మ, సూరిబాబు, కృష్ణబాబు ఆధ్వర్యంలో గణపతి పూజ, గోపూజ, మండపారాధన, హోమాలు, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మాజీ సర్పంచ్ పసుమర్తి సతీష్, ఉపసర్పంచ్ యేలేటి సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మోత్కూరి శ్రీనివాసరావు, గద్దే నరసింహమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీడలకు పాఠశాలలే పునాది



నల్లజర్లలో భాష్యం ఇంట్రాజోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

నల్లజర్ల: ఎటువంటి క్రీడాకారులైనా పాఠశాలలో ఆడే క్రీడలే పునాదిగా ఉంటాయని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నల్లజర్ల భాష్యం స్కూల్లో శుక్రవారం ఇంట్రాజోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల్లో సైతం క్రీడలపై ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. అంచెలంచెలుగా ఎదిగిన క్రీడాకారులే భవిష్యత్తులో ఉన్నతంగా ఎదుగుతారన్నారు. జెండా ఆవిష్కరించి క్రీడా జ్యోతి వెలిగించి పావురాలను గాలిలోకి ఎగురవేశారు. భాష్యం జోనల్ విద్యాధికారి ఎ.శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల నుంచి 10 భాష్యం బ్రాంచి విద్యార్థులు హాజరైనట్టు చెప్పారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ మొదలైన క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. నల్లజర్ల శాఖ ప్రిన్సిపాల్ జీవై రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టుపై పట్టు..ఉపాధికి మెట్టు

- చదువుతోనే ప్రత్యేక శిక్షణ
- ఆసక్తిగా నేర్చుకుంటున్న విద్యార్థినులు
- నల్లజర్ల హైస్కూల్‌లో కార్యక్రమం



నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో కుట్లు, అల్లికలు నేర్చుకుంటున్న విద్యార్థినులు



విద్యార్థినికి కుట్టు మెషీన్‌పై తర్ఫీదునిస్తున్న టీచర్ బేబీ సరోజిని

నల్లజర్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు చదువుతో పాటు చేతి వృత్తిలో నైపుణ్యం సాధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలోని 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు చదువుతో పాటు స్వయం ఉపాధిలో శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో విద్యాశాఖ 30 ఏళ్ల క్రితం ప్రతి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను ఎంపిక చేసింది. అక్కడి విద్యార్థినులకు కుట్లు, అల్లికలు నేర్పేందుకు ప్రైవేటు టీచర్లను నియమించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో దీనికి రూపకల్పన జరిగింది. ఈ తరహా టీచర్లను వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా రెగ్యులర్ చేశారు.

అప్పట్లో 150 మంది టీచర్లు

అప్పట్లో జిల్లాలో 150 మంది ఈ వృత్తి శిక్షణ టీచర్లు ఉండేవారు. అయితే ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కొత్త నియామకాలు జరగకపోవడంతో జిల్లాలో నేటికి 15 మంది మాత్రమే మిగిలారు. అందులో కుట్టు శిక్షణకు సంబంధించి ఒక్క నల్లజర్ల హైస్కూలులోనే టీచర్ ఉండటంతో నేటికి ఈ కార్యక్రమం యథాతథంగా జరుగుతోంది.

విద్యార్థినులు దుస్తులు కత్తిరించడం, మెషీన్‌పై కుట్టడంలో తర్ఫీదు పొందుతున్నట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం చాగంటి కోమల చిత్ర తెలిపారు. ఇందుకోసం వారానికి మూడు పిరియడ్లు కేటాయించినట్టు చెప్పారు. కుట్టులో పట్టు సాధిస్తే పాఠశాల విద్య పూర్తయిన వెంటనే స్వయం ఉపాధి పొందవచ్చనే కారణంతో విద్యార్థినులు ఆసక్తిగా నేర్చుకుంటున్నట్టు చెప్పారు.

ఆసక్తి పెరుగుతోంది



వృత్తి విద్యలో భాగంగా కుట్లు, అల్లికలు నేర్చుకుంటున్నాను. టీచర్ శ్రద్ధగా చెబుతున్నారు. అల్లికలతో పాటు చిన్న పిల్లలకు గౌన్లు, జుబ్బాల వంటివి కుదుతున్నాను. నేర్చుకునే కొద్దీ ఆసక్తి పెరుగుతోంది.

– ఎం.మీనాక్షి, విద్యార్థిని, నల్లజర్ల

ఖాళీగా ఉండకుండా..



చదువుకుంటూనే కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ కుట్లు, దుస్తులపై అల్లికలు నేర్చుకుంటున్నాను. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మరచిపోకుండా కరోనా సమయంలో ఇంటివద్ద సాధన చేశాను. దుస్తులపై ముద్ద, కాడ, గొలుసు, లాంగ్ అండ్ షార్ట్ వేయడంలో ప్రావీణ్యం సాధించాను.

– ఎ.లక్ష్మీప్రసన్న, విద్యార్థిని, నల్లజర్ల

15 రకాల కుట్లు, అల్లికలు



ఆడ పిల్లలకు 15 రకాల కుట్లు, అల్లికలలో, మగ పిల్లలకు ఎలక్ట్రికల్ వైరింగ్‌లో శిక్షణ ఇస్తున్నాం. 10వ తరగతిలో ఫిబ్రవరిలో థియరీపైనా, ఏప్రిల్‌లో ప్రాక్టికల్స్‌పై పరీక్షలు జరుగుతాయి. థియరీ 40 మార్కులకు కనీసం 16 మార్కులు, ప్రాక్టికల్‌కు 60 మార్కులకు కనీసం 24 వస్తే పాసై సర్టిఫికెట్ అందిస్తున్నాం. విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

– బేబీ సరోజిని, కుట్టు టీచర్, నల్లజర్ల

రీసర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెరవలి: భూముల రీ సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. మండలంలోని ఖండవల్లిలో రీసర్వే తీరుపై శుక్రవారం ఆమె సమీక్షించారు. ఇక్కడ రీ సర్వే కోసం 11 టీములు ఏర్పాటు చేసి, 4 రోవర్లు ఇచ్చినా లక్ష్యం పూర్తి చేయడం లేదని, ఇలాగైతే ఎప్పటికి పూర్తి చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత మంది రైతులకు నోటీసులు ఇచ్చారని ప్రశ్నించగా ఒక్కొక్కరు ఒక్కో విధంగా బదులివ్వడంపై మండిపడ్డారు. సిబ్బందితో సమీక్షించడం లేదా అని తహసీల్దార్ డి.అచ్యుతకుమారిని ప్రశ్నించారు. వీఆర్వో సుబ్బారావు 200 నోటీసులు ఇచ్చినట్టు చెబుతూండగా 1,400 ఇచ్చామని సర్వేయర్ చెబుతున్నారని అన్నారు. కార్యాలయానికి వచ్చిన రైతులకు నోటీసులు ఇవ్వడం కాదని, రైతులను నేరుగా కలసి ఇవ్వాలని ఆదేశించారు. ఈ నెలాఖరుకు రైతులకు పూర్తి స్థాయిలో నోటీసులు అందించాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ జరిగిన సర్వేలో వచ్చిన అభ్యంతరాలు, అడంగల్‌లో ఉన్న భూమికి, చేసిన సర్వేలో భూమికి వచ్చిన తేడాలపై కలెక్టర్ ప్రశ్నించారు. ఏమీ లేదని సిబ్బంది బదులివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ సమస్యల పరిష్కారం దిశగా రీ సర్వే చేయాలని, రైతులకు చెప్పకుండా సర్వే చేస్తే ఫలితమేంటని ప్రశ్నించారు. ఇందులో అందరినీ భాగస్వాములను చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వేకు రైతులు సహకరించకపోతే ఎలాగని సర్పంచ్ నాగరాజును ప్రశ్నించారు. రికార్డులు పట్టుకొచ్చి సర్వేలో చూసుకోవాలే తప్ప సర్వే పూర్తయిన తరువాత చూసుకుంటే ఎలాగని అన్నారు. 1986 వరదలకు గ్రామంలో ఇళ్లు కొట్టుకుపోయాయని, దీంతో పొలాలకు దస్తావేజులు లేవని, అందుకే రైతులు రావడం లేదని సర్పంచ్ నాగరాజు చెప్పారు. ఇక్కడ భూములున్న వారు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారని, కౌలు రైతులకు సమాచారం ఇచ్చినా, అసలు రైతులు రావడం లేదని తెలిపారు. ఏటిగట్టు నిర్మాణ సమయంలో తీసుకున్న భూములను డివిజన్ చేయకపోవడంతో అన్ని భూములూ లంకలో ఉన్నట్లు వస్తున్నాయని, దీని వలన రిజిస్ట్రేషన్లు అవ్వడం లేదని పలువురు రైతులు కలెక్టర్‌కు చెప్పారు. వెంటనే సబ్ డివిజన్ చేయాలని సిబ్బందిని ప్రశాంతి ఆదేశించారు. కొవ్వూరు డివిజన్‌లో 9 చోట్ల రీసర్వే జరుగుతోందని, ఇందులో పెద్ద గ్రామాలైన దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు, ఖండవల్లి ఉన్నాయని చెప్పారు. గ్రామంలో తొలుత గ్రామకంఠం, పంట భూములు, ప్రభుత్వ భూములను గుర్తిస్తారని తెలిపారు. పంట భూములను బ్లాకులుగా విభజించామని, గ్రామ సరిహద్దుల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పంట భూముల సర్వే పూర్తి చేస్తామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా సర్వేయర్ ఏడీ బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

ఉండ్రాజవరం: మండలంలో మోర్త ప్రాథమిక పాఠశాల నంబర్–1లో శుక్రవారం నులిపురుగులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రోజా మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉండటం వలన రక్తహీనత వస్తుందన్నారు. స్కూల్ పిల్లలందరూ భోజనానికి ముందు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎం సరోజ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు అందరూ వేసుకోవాలన్నారు. నులిపురుగులు ఏ విధంగా అనారోగ్యానికి కారణం అవుతాయో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, హెచ్‌ఎం పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో..

నిడదవోలు రూరల్: పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ దినోత్సవంపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1–14 ఏళ్లలోపు వారికి డీ వార్మింగ్ మాత్రలను వేయాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్లు ఎం.శివాజీ, ఆశాలత, పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



కొవ్వూరులో వాహనదారులకు హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. పట్టణంలోని కోర్టు హాలులో శుక్రవారం హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లు పంపిణీ చేశారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, న్యాయ వాదులు పాల్గొన్నారు.

ఎలుకల సామూహిక నిర్మూలనకు చర్యలు

నిడదవోలు రూరల్: ఎలుకల నిర్మూలనకు బ్రోమోడయోలిన్ ఎరమందు పెట్టుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని శెట్టిపేట, రావిమెట్ల గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎలుకల వల్ల వరి పంటలో సుమారు 5 నుంచి 10 శాతం దిగుబడికి నష్టం జరుగుతుందన్నారు. నారుమడులు వేసిన నెల రోజుల వరకు ఎలుకలకు ఆహారం దొరకదన్నారు. ఎలుకల బుట్టలను ఎకరాకు 20 చొప్పున పెట్టడం ద్వారా వాటిని సమర్థవంతంగా నిర్మూలించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచుకుంటే అవకాశాలు మీ సొంతం

నల్లజర్ల: నేటి పోటీ ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాలు అలవర్చుకోవాలని స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ సహకార కళాశాల చైర్మన్ కంఠమణి వసుంధరాదేవి అన్నారు. ఇంటర్ సీనియర్ విద్యార్థులకు జూనియర్లు శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆమె మాట్లాడారు. విద్యార్థి దశలో ఇంటర్ విద్య కీలకమైనదన్నారు. ఉన్నత విద్య అభ్యసించే ముందు కోర్సుల ఎంపికపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే నైపుణ్యాలకు అనుగుణంగా లక్ష్యం నిర్దేశించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అనుకూలమైన కోర్సులు ఎంచుకున్నపుడే ఉన్నతమైన భవిష్యత్తు లభిస్తుందన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న ఎంతో మంది ప్రభుత్వోద్యోగాలు సాధించి, వివిధ హోదాల్లో పని చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ గన్నమని దొరయ్య, ప్రిన్సిపాల్ అజయ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కొవ్వూరు: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం కొవ్వూరులో ప్రచారం నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి ఉద్యోగులు, సిబ్బందికి కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థికి వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్ పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

కంబాలచెరువు: అపార్టుమెంట్‌పై వాకింగ్ చేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. కొంతమూరు రాజరాజేశ్వరిగుడి వీధిలోని ఐక్య అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఐ.సురేష్ (55) శుక్రవారం ఉదయం అపార్ట్‌మెంట్‌పైకి వెళ్లి వాకింగ్ చేస్తున్నాడు. అయితే ఐదో అంతస్తు నుంచి కిందకు పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అప్పటికే అతడు మృతి చెందాడు. రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి దగ్ధంపై కేసు

కంబాలచెరువు: తన ఇంటికి ఎవరో కావాలని నిప్పు పెట్టి, దహనం చేశారని ఆదెమ్మదిబ్బకు చెందిన కందుకూరి నారాయణమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. నారాయణమ్మ కుటుంబం కొద్దిరోజుల క్రితం వేరే ప్రాంతానికి వెళ్లింది. గురువారం అర్ధరాత్రి ఇంటి లోపల మంటలు వ్యాపించినట్లు స్థానికుల ద్వారా విషయం తెలిసి ఇక్కడకు వచ్చింది. ఇంటిలో సామగ్రి కాలిపోవడంతో ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంగరంగ వైభవంగా మహాలింగేశ్వరుని కల్యాణం



గౌరీపట్నంలో స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణ వేడుకలు తిలకిస్తున్న భక్తులు

- శాస్త్రోక్తంగా క్రతువు
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

దేవరపల్లి: గౌరీపట్నంలో వేంచేసిన గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ వేడుకలు శుక్రవారం రాత్రి వైభవంగా జరిగాయి. ప్రముఖ వ్యాపారవేత్త అంద్రు శ్రీనివాస్(బాబి), ఉషారాణి దంపతులతో వేదపండితులు కల్యాణ వేడుకలను నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు కల్యాణం ప్రారంభించి రాత్రి 11 గంటల వరకు నిర్వహించారు. అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను, అయ్యవార్లను పెండ్లి కుమారులుగా అలంకరించి కల్యాణ వేదికపైకి వేద పండితులు తోడ్కొని వచ్చారు. అనంతరం వేదపండితులు స్వామి వార్ల దివ్య కల్యాణాన్ని జరిపించారు. కల్యాణ వేడుక గురించి వేదపండితులు భక్తులకు వివరించారు. కల్యాణం యొక్క విశిష్టతను భక్తులకు తెలిపారు. కల్యాణం అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం ఇచ్చి కల్యాణ అక్షితలు, తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి వార్లు, అమ్మవార్ల కల్యాణానికి అవసరమైన పట్టువస్త్రాలను అంద్రు శ్రీనివాస్, ఉషారాణి దంపతులు అందజేశారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి పులకించారు. శివ నామస్మరణ, గోవిందనామాలతో దేవస్థానం మార్మోగింది. వందలాది మంది భక్తులు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఐదు రోజులుగా జరుగుతున్న పూజలు పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి.

అందుబాటులో గుండెపోటు ఇంజక్షన్



ఇంజక్షన్ వివరాలతో ఉన్న పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్ అన్సారీ, వైద్యులు

నిడదవోలు: పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో గుండెపోటుకు గురైన రోగులకు ఉపయోగపడే రూ.45,000 విలువైన టెనెక్టెప్లేజ్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్ అన్సారీ తెలిపారు. ఈ ఇంజక్షన్‌కు సంబంధించిన వివరాలతో కూడిన పోస్టర్లను శుక్రవారం వైద్యులు ఆవిష్కరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్ అన్సారి మాట్లాడుతూ ఈ టెనెక్టెప్లేజ్ ఇంజక్షన్ అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉందన్నారు. గుండెపోటు వచ్చిన వారికి ఈ ఇంజక్షన్ ఉచితంగా చేస్తామన్నారు. ఫిజీషియన్ డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ గుండెపోటు (హార్ట్ అటాక్) లక్షణాలైన ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, చెమటలు, ఒళ్లు ఒక్కసారిగా చల్లబడిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి వెళితే ఈసీజీ పరీక్ష నిర్వహించి గుండెపోటు నిర్ధారణ చేసిన తర్వాత రూ.45,000 విలువైన టెనెక్టెప్లేజ్ ఇంజక్షన్ ఉచితంగా చేస్తామన్నారు. గుండెపోటుకు గురైన రోగులు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణం దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు వచ్చి ఈ విలువైన సేవలను అవకాశాన్ని ఉపయోగించుకోవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ఈ ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో వైద్యులు అస్మత్, సుష్మా, హెడ్‌నర్సు హెప్సిబా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

‘పొనమాల’కు మాజీ మంత్రి వనిత పరామర్శ



వైఎస్సార్ సీపీ నేత ఉమామహేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత

ద్వారకాతిరుమల: స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు పొనమాల ఉమామహేశ్వరరావును రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం పరామర్శించారు. ఆయన తల్లి మృతి చెంది ఏడాది పూర్తి కావడంతో వాటికి సంబంధించిన కార్యక్రమాలను ఇటీవల నిర్వహించారు. వాటిలో వనిత పాల్గొనలేకపోవడంతో శుక్రవారం ఉమామహేశ్వరరావు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చిలుకూరి చంద్రం, రుద్ర శివ, చెన్నూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే జి.కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఏసురత్నం కుమారుడి వివాహ రిసెప్షన్‌లో వనిత పాల్గొన్నారు. నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆమె వెంట జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఉండ్రాజవరం: ఎంవీఎస్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమ్ హాస్పిటల్ సౌజన్యంతో మండలంలో వెలగదుర్రులో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ బషీర్ సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. 15 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముదునూరి రవీంద్రరాజు, పి.శ్రీనివాసరాజు, నారాయణరాజు, ఇందుకూరి త్రినాథ్‌రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ టూర్లతో సాంకేతిక విషయాలపై అవగాహన



రవళి స్పిన్నింగ్ మిల్లును సందర్శించిన ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఉండ్రాజవరం: స్టడీ టూర్ల వలన విద్యార్థులకు సాంకేతిక విషయాలపై అవగాహన కలుగుతుందని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.మాణిక్యాలరావు అన్నారు. స్టడీ టూర్‌లో భాగంగా ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం పెరవలి మండలంలోని రవళి స్పిన్నింగ్ మిల్‌ను సందర్శించారు. పరిశ్రమకు చెందిన ఉన్నతాధికారి వీరాస్వామి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్తి పంట ద్వారా లభించిన దూదిని సేకరించి దాని నుంచి రకరకాల వడపోతల ద్వారా దారానికి అనువైన దూదిని తయారు చేసి ఆ దూది ద్వారా దారాలను వడకడతారన్నారు. వస్త్ర పరిశ్రమకు ఈ దారాలను పంపించిన అనంతరం బట్టలుగా తయారవుతాయని వివరించారు. కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులతో పాటు ఒకేషనల్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా రహదారుల మరమ్మతులు



చాగల్లులో రహదారి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చాగల్లు: గ్రామాల్లో చేపట్టిన రహదారుల మరమ్మతుల పనుల్లో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. చాగల్లు నుంచి కొవ్వూరు వయా నందమూరు మీదుగా రహదారి మరమ్మతులు జరుగుతున్నాయి. గోతులను పూడ్చడం కోసం ఎక్కడికక్కడ రోడ్డుకు అడ్డంగా కంకర రాళ్లు, చిప్స్ వేశారు. ఇవి వాహనచోదకుల పాలిట ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయాల్లో ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేసే వారికి అక్కడ కంకర గుట్టలు ఉన్నాయని తెలియకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. చాగల్లు శివారు పేముల కాలువ వంతెన వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులను పెట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా గత రెండు రోజుల్లోనే ఇక్కడ ఐదుకు పైగా ప్రమాదాలు జరిగాయి. ద్విచక్ర వాహనదారులు రహదారిపై జారి పడ్డారు. అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఆర్‌అండ్‌బీ సిబ్బంది ఇక్కడ హెచ్చరిక బోర్డులు పెడితే ప్రమాదాలు జరిగి ఉండేవి కాదని వాహన చోదకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేసే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.